కౌన్సిలర్ ఆధ్వర్యంలో దీక్షాపరులకు భిక్ష

పూజలో పాల్గొన్న కౌన్సిలర్ హరికృష్ణ

మంచిర్యాలటౌన్, మే 25 : మంచిర్యాల మున్సిపాలిటీలోని ఐదోవార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయికుంట ఏరియాలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ స్వాములు దెబ్బటి శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో దీక్షాపరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న డీఐఈవో శంకర్

ఆసిఫాబాద్ టౌన్, మే 25 : జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్ ఫస్ట్ఇయర్‌లో 560 మందికి 532 మంది పరీక్ష రాశారని, 28 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సెకండియర్‌లో 319 మందికి, 312 మంది పరీక్షకు హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జైనూర్ మే 25 : మండలంలోని ఉషేగావ్ సర్కార్ దవాఖాన పరిధిలో గల టింకాపల్లి, కోకా గూడ తదితర గిరి గ్రామాల్లో వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులకు రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో రమేష్, గణేష్, హెచ్ఎ, జమ్మూ, జంగులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

ఆసిఫాబాద్ టౌన్, మే 25 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం వారసంతను పురస్కరించుకుని ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్‌యహీయా (తారిక్) ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుల్లూరి శంకర్, నాంపల్లి శంకర్, అహ్మద్, అబ్దుల్లా, ఖాలిద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో ఉండాలి

ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

లక్షెట్టిపేట, మే 25 : అండర్ ట్రైన్డ్ ఖైదీలు సత్ప్రవర్తతో ఉండాలని మంచిర్యాల జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు సూచించారు. లక్షెట్టిపేట పట్టణంలోని సబ్ జైలును ఆయన శనివారం సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. శిక్షణ అనుభవించి బయటకు వెళ్లిన తర్వాత క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. సబ్ జైలులో వసతులను అండర్ ట్రైన్డ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వార్డెన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ స్వామి, సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కౌటాల, మే 25 : మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన కారెం పెంటయ్య(65) శనివారం పంట పొలాలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెంటయ్యకు ఇద్దరు బిడ్డలు కాగా, వారికి పెండ్లి అయ్యింది. ఓ కూతరు ముత్తంపేటలో ఉంటుండగా, ఆమె దగ్గరే ఉంటున్నాడు. కాగా, తాగిన మైకంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

పెద్దదోభ గ్రామంలో యువతి..

సిర్పూర్(యూ), మే 25 : మండలంలోని పెద్దదోభలో భీంరావ్ ఐదో కూతురు సోంబాయి (16) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నదని ఎస్ఐ మాధవ్‌గౌడ్ తెలిపారు. ఉదయం చేను పనికి త్వరగా రమ్మని తండ్రి మందలించాడు. అనంతరం తన భార్యతో చేనుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి పురుగుల మందు తాగి కింద పడి ఉన్నది. వెంటనే జైనూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. అక్కడి వైద్యుల సూచనల మేరకకు ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. భీంరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులను మోసం చేస్తున్నది కాంగ్రెస్ కార్యకర్తలే

చెన్నూర్ రూరల్, మే 25 : కాంగ్రెస్ కార్యకర్తలే రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఆరోపించారు. చెన్నూర్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను రైతులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలన్నీ కాంగ్రెస్ నాయకుల చేతుల్లోనే ఉన్నాయని ఆరోపించారు. నిర్వాహకులు, మిల్లర్లు ఒక్కటై రైతులను నిండా ముంచుతున్నారని మండిపడ్డారు. రైతులు అరిగోసపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ నాయకులు దుర్గం అశోక్, జాడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమ కేసులు పెడితే సహించం

మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, మే 25 : అక్రమ, బూటకపు దొంగ కేసులను బనాయిస్తే సహించేదే లేదని మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో గల బీఎంఏ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత శనివారం సిద్ధిపేటకు చెందిన టూ టౌన్ సీఐ ఓ దొంగను మంచిర్యాలకు తీసుకవచ్చి, ఓ యజమాని దొంగ బంగారం కొన్నాడని, పోలీసులు పూర్తి విచారణ చేయకుండానే తీసుకవెళ్లారన్నారు. సదరు దొంగ మాటలు విని, వ్యాపారులు చెప్పిన మాటలు నమ్మకుండా బలవంతంగా తీసుకెళ్లడం సమజసం కాదని పేర్కొన్నారు. అతను ఒక గురిజ బంగారం కూడా కొనలేదన్నారు. న్యాయం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. అందులో భాగంగానే దుకాణాలు మూసివేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఏ జిల్లా అధ్యక్షుడు సింహరాజు శ్రీనివాస్, స్వర్ణకార పట్టణ అధ్యక్షుడు బ్రహ్మయ్య, విశ్వకర్మ చానల్ ఎండీ గుండోజు లక్ష్మీనరసింహా చారి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇండ్లే టార్గెట్

- 5 నెలలుగా యువకుల దొంగతనాలు
- 16.2 తులాల బంగారు, వెండి ఆభరణాల రికవరీ
- ఏడుగురి అరెస్ట్, రిమాండ్..
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మే 25 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 5 నెలలుగా తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసి, బంగారు, వెండి ఆభరణాల దొంగతనానికి పాల్పడుతున్న ఏడుగురు యువకులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నస్పూర్‌కు చెందిన పాగిడి కార్తిక్, గన్నారం మధూకర్, మంచిర్యాల గాంధీ నగర్‌కు చెందిన తాటికొండ స్వామి చరణ్, బెల్లంపల్లికి చెందిన పుప్పాల రాహుల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం కాసిపేటకు చెందిన కుర్సింగ ఈశ్వర్, కన్నెపల్లికి చెందిన వేడ్మ ప్రవీణ్, తిర్యాణికి చెందిన మడావి రాము జల్సాలకు అలవాటు పడ్డారని తెలిపారు. అందుకు సులువుగా డబ్బు సంపాధించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ మేరకు పగలు బైక్‌పై తిరుగుతూ.. తాళం వేసిన ఇండ్లను గమనించి, రాత్రి దొంగతనం చేస్తున్నారని తెలిపారు. దొంగిలించిన వస్తువులను కరీంనగర్‌లో అమ్మేందుకు ఐదుగురు గాంధీనగర్‌లోని తాటికొండ స్వామి చరణ్ ఇంటి వద్ద ఉన్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి, వారిని పట్టుకున్నట్లు చెప్పారు. మరో ఇద్దరిని రామకృష్ణాపూర్

దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న సీపీ శ్రీనివాస్

లోని క్యాతనపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, పరిపోయే క్రమంలో అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారందరినీ విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారని పేర్కొన్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలు(రూ.9,22 లక్షల విలువ), వెండి (రూ.60 వేల విలువ), రూ.50 వేల విలువ గల బైక్, రూ.1.20 లక్షల విలువగల స్మార్ట్ టీవీ, హోమ్ థియేటర్, రూ.20 వేల విలువల గల గిటార్ మొత్తం విలువ రూ.11,72 లక్షలు ఉంటుందన్నారు. అనంతరం నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను అభినందించి, వారికి రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంచిర్యాల టౌన్ సీఐ బన్సీలాల్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలలో దొంగతనం చేసిన ప్రాంతాల వివరాలు..

ఫిబ్రవరి మొదటి వారంలో మంచిర్యాలలోని జాఫర్ నగర్‌లో గల ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలోని రెండు బంగారు ఉంగరాలు, ఒక జత చెవి కమ్మలు దొంగిలించినట్లు సీపీ వివరించారు. మార్చి రెండో వారంలో సీసీసీ నస్పూర్‌లోని ఓ ఇంట్లో రూ.50 వేలు, బంగారు చైన్, ఒక జత చెవి కమ్మలు.., ఏప్రిల్‌లో మాక్స్ షాపింగ్ మాల్ దగ్గర గల సాయి హనుమాన్ నగర్‌లోని ఇంట్లో బంగారు చైన్, రెండు చిన్న బంగారు గాజులు, 5 ఉంగరాలు, 3 వెండి గిన్నెలు, 2 వెండి చిన్న చేతి కడియాలు, వెండి కాలి కడియం, రెండు జతల వెండి కాలి పట్టీలు.., ఏప్రిల్ రెండో వారంలో హాజీపూర్ మండలంలోని గుడిపేట్‌లో 10 జతల వెండి కాలి పట్టీలు, వెండి కడియాలు, బంగారు చైన్, చిన్న బంగారు ఉంగరం, రూ.20 వేలు.., అదే రోజున దొంగతనం చేసి, తిరిగివస్తూ మార్గమధ్యంలో వేంపల్లిలోని ఎస్‌బీఆర్‌కాలనీలోని ఓ ఇంట్లో ఒక స్మార్ట్ టీవీ, హోమ్ థియేటర్.., అదే నెలలో మారుతినగర్‌లోని ఓ ఇంట్లోకి చొరబది ఒక్కోటి తులంనర గల రెండు బంగారు నెక్లెస్‌లు, సుమారు 3 తులాలు గల రెండు బంగారు గొలుసులు, ఒక ల్యాప్‌టాప్, మొబైల్ దొంగిలించినట్లు వెల్లడించారు.

రామకృష్ణాపూర్, బెల్లంపల్లి వన్, టూ టౌన్, మందమర్రిలో..

గద్దెరాగడిలోని ఓ ఇంట్లో బంగారు గొలుసు, వెండి పట్టీలు, నగదు, పూజా (వెండి) సామగ్రి.., బెల్లంపల్లి స్టేషన్ రోడ్డు కాలనీలోని ఓ ఇంట్లో బంగారు ఉంగరం, బంగారు చైన్, మూడు బంగారు ఉంగరాలు, రూ.20 వేలు.., అమ్మగార్డెన్ ఏరియాలో రూ.25 వేలు, కెమెరా.., బెల్లంపలిలోని బూడిదగడ్డబస్తీలో ఒక జత వెండి కడియాలు, ఒక జత చెవి కమ్మలు, బంగారు ఉంగరం, మొబైల్.., ఆర్ ఆర్ నగర్‌లో రెండు ఇండ్లలో ఒక బంగారు ఉంగరం, చెవికమ్మలు.., బెల్లంపల్లి కాల్టెక్స్ ఏరియాలో హోండా షైన్ బైక్‌ను దొంగలించినట్లు వివరాలు వెల్లడించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

- మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ
- నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సులు

తాండూర్ : కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

తాండూర్, మే 25 : విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఈ సురేఖ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, రేచిని, ద్వారకాపూర్ పంచాయతీల్లో శనివారం రైతులకు విత్తనాల కొనుగోలు, నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అధికారిణి సురేఖ హాజరై, మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, లైసెన్స్ కల్గిన దుకాణాల్లో కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యే దాకా భద్రపర్చుకోవాలని తెలిపారు. డీలర్లు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దళారుల వద్ద లూజు విత్తనాలు తీసుకొని మోసపోవద్దని తెపారు. 27న పెగడపల్లి, రేపల్లెవాడ, అన్నారం, కాసిపేట, చంద్రపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఉంటాయని, రైతులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమాలోల వ్యవసాయ విస్తరణ అధికారులు వీ శంకర్, వీ ధనలక్ష్మి, కే పుష్పలత, పంచాయతీ కార్యదర్శులు పీ శ్రీనివాస్, ఎం లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

సారంగపల్లిలో..

మందమర్రి రూరల్, మే 25 : మందమర్రి మండలం సారంగపల్లి పరిధిలో ఏఈవో ముత్యం తిరుపతి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఫిరోజ్, రాయమల్లు, మహేందర్, ప్రసాద్, రమేశ్, మల్లారెడ్డి, సురేశ్, మహేందర్ రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట మండలంలో..

లక్షెట్టిపేట, మే 25 : మండలంలోని బలరావుపేట, మిట్టపల్లి, ఊత్కూర్, మోదెల, హన్మంత్‌పల్లి గ్రామాల్లో రైతులకు ఏవో ప్రభాకర్ రెడ్డి అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈవోలు ప్రసన్న, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, అనూష, ఇర్ఫానాయాస్మిన్ ఉన్నారు.

మామిడిపెల్లిలో..

దండేపల్లి, మే 25 : దండేపల్లి మండలం మామిడిపెల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి అంజిత్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సృజన, రైతులు ఉన్నారు.

భీమిని రైతువేదికలో..

కన్నెపల్లి, మే 25 : భీమిని రైతు వేదికలో ఏఈవో వినోద్‌కుమార్ విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు.

లింగన్నపేట, ఎదుల్లబంధంలో..

కోటపల్లి, మే 25 : కోటపల్లి మండలంలోని లింగన్నపేట, ఎదుల్లబంధం గ్రామాల్లో ఏఈవో అనూషతో కలిసి మండల వ్యవసాయ అధికారి మహేందర్ రైతులకు అవగాహన కల్పించారు. పంగిడి సోమారంలో ఏఈవో రాజ్‌కుమార్, నక్కలపల్లి గ్రామంలో ఏఈవో వైష్ణవి, అర్జునగుట్ట గ్రామంలో ఏఈవో శేఖర్ ఆధ్వర్యంలో పత్తి విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు.

ముత్యంపల్లి, సోనాపూర్‌లో..

కాసిపేట, మే 25 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, సోనాపూర్ గ్రామ పంచాయతీల్లో మండల వ్యవసాయాధికారిని దేవులపల్లి వందన రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య, అంజలి, రైతులు పాల్గొన్నారు.

ఇందిర్‌గాంలో..

బెజ్జూర్, మే 25 : మండలంలోని ఇందిర్‌గాం గ్రామంలో రైతులకు ఏఈవో శ్రీధర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేచిని, ఇందర్‌గాం రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్య గాలికొదిలి..

- విదేశాల్లో సేదతీరుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్
- మండిపడ్డ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజా రమేశ్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాజా రమేశ్

కోటపల్లి, మే 25 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అవస్థలు పడుతుంటే చెన్నూర్ ఎమ్మెల్యే వెంకటస్వామి విదేశాలకు వెళ్లి సేదతీరుతున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రాజా రమేశ్ ఆరోపించారు. కోటపల్లి మండలం బబ్బెరచెలుక గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన రాజా రమేశ్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతుంటే ఇవేమీ పట్టవన్నట్లు స్థానిక ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లాడని మండిపడ్డారు. వర్షాలు పడుతుండడంతో రైతులు కేంద్రాల్లో అరిగోసపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. కొనుగోళ్లలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారని వాపోయాడు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి సమస్యా లేదని గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, ధాన్యం విక్రయాలోల వేగం పెంచేవారని, రైతులకు న్యాయం చేశాడని పేర్కొన్నారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు మారిశెట్టి తిరుపతి, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి సంపత్, మండల నాయకులు గోనె సత్యనారాయణ, సందీప్ రెడ్డి, దుర్గం మల్లయ్య, బాపు, అనిల్, యోగానంద్ పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు

సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కన్నెపల్లి, మే 25 : గ్రామాల్లో చేసే పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు అధికారులను హెచ్చరించారు. కన్నెపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీ, ప్రకృతి వనాలు, డంప్‌యార్డు, స్మశాన వాటికలను పరిశీలించారు. స్మశాన వాటికలో మద్యం సీసాలు పడి ఉండడంతో వాటిని తొలగించాలని సూచించారు. నర్సరీలు, ప్రకృతి వనాల్లోని మొక్కలను సంరక్షించాలన్నారు. తడి, పొడి చెత్త సేకరించి, సెగ్రిగేషన్ షెడ్డులో వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అభిలాష్ ఉన్నారు.

విద్యుత్ స్తంభాలు ధ్వంసం

పెంచికల్ పేట్, మే 25 : పెంచికల్‌పేట్ మండలం పెద్దవాగు సమీపంలోని ప్రధాన రహదారిపై వ్యవసాయ విద్యుత్ లైన్ స్తంభాలను శనివారం గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో రెండు విరిగిపోయాయని ఇన్‌చార్జి ఏఈ అంజల్ కుమార్ తెలిపారు. సుమారు రూ.10 వేల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. త్వరలోనే మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం కానీ జరగలేదని పేర్కొన్నారు.

వారంలోగా పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా విద్యాధికారి సదయ్య

భీమారం : పనులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి సదయ్య

భీమారం, మే 25 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు వారంలోగా పూర్తి చేయాలని మంచిర్యాల డీఈవో సదయ్య ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ, అర్కెపల్లి, తాళ్లగూడెం, బీఎల్‌సీ కాలనీల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఐకేపీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ కేంద్రాలను సందర్శించారు. విద్యాశాఖ అధికారి కొమ్మెర రాధాకృష్ణ, మూర్తి, సెక్టోరియల్ అధికారి కే చౌదరి తదితరులున్నారు.

మందమర్రిలో ఎంపీడీవో..

మందమర్రి రూరల్, మే 25 : మండలంలోని పొన్నారం, మామిడిగట్టు, ఎమ్మెల్యే కాలనీ, గుడిపల్లి గ్రామ పంచాయతీల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. మామిడిగట్టులో ఉపాధి పనులను పర్యవేక్షించారు.

సోలగూడ, కొమ్ముగూడ, డోర్‌పల్లిలో..

సిర్పూర్(టీ), మే 25 : మండలంలోని సోలగూడ, కొమ్ముగూడ, డోర్‌పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలోల కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సిర్పూర్(టీ) ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. పనులు గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి ఫహీం భాను, ఫీల్డ్ అసిస్టెంట్ విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి

కౌటాల, మే 25 : పంచాయతీ ఆస్తులను ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా అందుబాటులోకి తేవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీపీవో భిక్షపతి అన్నారు. కౌటల పంచాయతీలో శనివారం డీఎల్పీవో సురేశ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆస్తులు, వాటి రక్షణ గురించి వివరించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం, స్మశాన వాటిక, క్రీడా ప్రాంగణం, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలను పరిశీలించారు. పంచాయతీ ఆస్తులను కాపాడుకుంటూ, జీపీలు అభివృద్ధి దిశగా పయనించేలా కార్యదర్శి, సిబ్బంది కృషిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం చేయాల్సిన పనులపై మండల కార్యదర్శులకు వివరించారు. ప్రతీ కార్యదర్శి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట అన్ని గ్రామాల కార్యదర్శులు తదితరులున్నారు.

నిత్యం పారిశుధ్య పనులు చేయాలి

నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో సర్ఫర్‌అలీ

తాండూర్, మే 25 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని డీఎల్పీవో సర్ఫర్ అలీ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అచ్చలాపూర్ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రిజిస్టర్లు పరిశీలించి, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, స్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ప్రతిరోజూ తడి పొడి చెత్త వేరుగా సేకరిస్తూ సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని, కంపోస్టు ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ ఉన్నారు.

భీమన్న గుడి భూమి అక్రమిస్తే ఊరుకోం

కాగజ్‌నగర్, మే 25 : కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ భీమన్న గుడి భూమిని ఆక్రమించాలని చూస్తే ఊరుకోబోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అధికారులతో కుమ్మక్కైన సదరు వ్యక్తి గుడి భూమిని అక్రమించాలని చూస్తున్నాడని ఆరోపించారు. విషయం తెలుసుకున్నా భజ్‌రంగ్‌దళ్ నాయకులు అక్కడికి వెళ్లి ప్రశ్నించగా, సదరు అధికారులు భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భజ్‌రంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్, నాయకులు సిందం శ్రీనివాస్, సత్యనారాయణ, విశ్వేశ్వర్‌రావు, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, మే 25 : విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కౌటాల సబ్ డివిజన్ ఏడీఈ రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ మండలం పెద్దబండ నుంచి లోన వెల్లి సబ్ స్టేషన్ వరకు విద్యుత్ లైన్ మరమ్మతులు, మెయింటనెన్స్ పనులు చేస్తున్నందున ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు సిర్పూర్, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

హాజీపూర్, మే 25 : మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తుల కనిపిస్తే అప్రమత్తంగా ఉండి, పోలీసులకు సమాచారం అందించాలని హాజీపూర్ ఎస్ఐ సురేశ్ కుమార్ తెలిపారు. ఇటీవల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చెత్త వేయరాదని బోర్డులు

కాసిపేట, మే 25 : బెల్లంపల్లి మండలం సోమగూడెం పంచాయతీలోని పలు కాలనీల్లో 'చెత్త వేయరాదని' కార్యదర్శి సంబోజు రాజలింగు ఆధ్వర్యంలో సిబ్బంది బోర్డులను ఏర్పాటు చ